క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు: మండలంలోని కురాకులపల్లిలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో చిన్న వన్నూరుస్వామి (45) శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ1 దాసరి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశులు మృతుని భార్యకు దహన సంస్కారాల కోసం రు.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ వన్నూరుస్వామి, రాజు తదితరులు మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ శ్రీనివాసన్, ఈసీ వన్నూరుస్వామి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి శుక్రవారం ప్రశాంతంగా ఎన్నిక జరిగింది. 29 ఓట్ల మెజారిటీతో ఎన్‌సీ శ్రీనివాసన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఈసీ వన్నూరుస్వామి, ఉపాధ్యక్షుడిగా జి.వెంకటరెడ్డి, కోశాధికారిగా బి.మమత, సంయుక్త కార్యదర్శిగా కె.పృథ్వీరాజ్, గౌరవాధ్యక్షుడిగా ఎం.హనుమంతరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జి.లోకానంద, శ్యామల, విజయరావు, నరసింహరావు, జాన్సన్, నిర్మల, రేణుక ఏకగ్రీవమయ్యారు.

నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయొద్దు

ఉరవకొండ: తొట్టెలు, డ్రమ్ముల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని, నీటిలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం ఉంటుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మానాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెలిగొండ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం నాగేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నియమనిష్టలతో ఉపవాస దీక్షలు



మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నియమనిష్టలతో కొనసాగుతున్నాయి. రెండో శుక్రవారం పట్టణంలోని మసీదులు ముస్లింలతో కిక్కిరిసాయి. పట్టణంలో మొత్తం 26 మసీదులు ఉండగా శుక్రవారం ప్రత్యేక జోహర్ నమాజ్‌కు పెద్ద ఎత్తున ముస్లిం హాజరై సామూహిక ప్రార్థనలు చేశారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత ప్రత్యేక తరావీ నమాజ్(ఖురాన్ పఠనం)ను కూడా ముస్లిం ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ తరావీ నమాజ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి హాఫీజ్‌లను పిలిపించి బోధనలు చేయించారు.

పరామర్శ



కిరణ్‌రెడ్డిని పరామర్శిస్తున్న వై.మధుసూదన్‌రెడ్డి

కూడేరు: టీడీపీ నాయకుల దాడిలో గాయపడి అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రామచంద్రాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కృష్ణారెడ్డి కుమారుడు సాయికిరణ్‌రెడ్డిని శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. తన తోటలో కొబ్బరి బొండాలను దొంగతనం చేయడంతో దండించినందుకు టీడీపీకి చెందిన వెంకటప్ప, రాము, అనిల్, సుబ్రమణ్యం, ఆది ఇంటి వద్దకు వచ్చి దాడి చేశారన్నారు. అలాగే కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు వివరించాడు. స్పందించిన ఆయన వెంటనే ఉరవకొండ సీఐతో ఫోన్‌లో మాట్లాడి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

13 ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మఘట్ట: మద్యం కేసుల్లో పట్టుబడిన 13 ద్విచక్ర వాహనాలను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేసినట్లు సెబ్ సీఐ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీరాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రూ.1,40,892 ఆదాయం వచ్చిందన్నారు.

వైభవంగా యణ్జేరంగస్వామి రథోత్సవం

కణేకల్లు: మహిమాన్వితుడు....కోరిన కోరెక్కలు తీర్చే భక్తుల ఆరాధ్యదైవమైన యణ్జేరంగస్వామి రథోత్సవం మండలంలోని యర్రగుంట గ్రామంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో రథోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలను తిలకించేందుకు రాయదుర్గం, బొమ్మనహాళ్, బెలుగుప్ప, డి.హీరేహాళ్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైస్ సర్పంచు కెనిగుంట రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ వెంకటరెడ్డి, అశోక్, కె.జే.ఈరన్న, కె.హనుమంతరాయుడు, కె.అనిల్, గౌని శ్రీనివాసరెడ్డి, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, గంగలాపురం ముత్తు, ధర్మకర్త ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జై..ఆంజనేయా..

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురంలో శుక్రవారం వైభవంగా బాల అభయంజనేయస్వామి రథోత్సవం నిర్వహించారు. శ్రీరామ నవమి మరుసటి దినం వేడుకలను చేపట్టడం ఆనవాయితగా వస్తోందని సర్పంచ్ మల్లికార్జున తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం తో గ్రామం జన సంద్రంగా మారింది. రాత్రికి గ్రామంలో హేమరెడ్డి మల్లయ్య నాట్య ప్రదర్శన చేపట్టారు.

సీతారాముల రథోత్సవం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించు కుని శుక్రవారం సాయంత్రం సీతారాముల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ధర్మప్ప దేవాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజల చేపట్టారు. అనంతరం రథం ముందు హోమాలు నిర్వహించారు. సాయంత్రం జై శ్రీరామ్ అంటూ భక్తులు రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరవింద్‌గౌడ్, నరేంద్రగౌడ్, ప్రశాంత్‌గౌడ్, రాచన్నగౌడ్,రామలింగారెడ్డి, సర్పంచు కురుబలక్ష్మయ్య, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, గ్రామస్తులు పాల్గొ న్నారు. ఎస్ఐ వెంకటస్వామి బందో బస్తు నిర్వహించారు.

నమో..రంగనాథా..

బ్రహ్మసముద్రం: నమో రంగనాథా అంటూ వేపులపర్తి మార్మోగింది. ఆంధ్ర , కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మడుగు తేరుపై స్వామిని ఊరేగించారు. సాయంత్రం రంగనాథ స్వామి బ్రహ్మరథోత్సవం వేలాదిమంది భక్తుల నడుమ , మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ముందుకు సాగింది. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీతారాముల రథోత్సవం

బ్రహ్మసముద్రం మండలంలోని గుండిగానిపల్లిలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని శుక్రవారం సీతారాముల రథోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి రథోత్సవంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు జెడ్పీటీసీ ప్రభావతి, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్ సుజాతమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్న ఓబుళేసు దేవర ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో పెన్న ఓబుళేసు దేవర ఉత్సవాలను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు.



కణేకల్లు: యణ్జేరంగస్వామి రథోత్సవానికి పోటెత్తిన భక్తులు



కణేకల్లు: రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



బ్రహ్మసముద్రం: రంగనాథ రథోత్సవం



డి హీరేహాళ్: రథం లాగుతున్న గ్రామస్తులు



వజ్రకరూరు: సీతారాముల రథోత్సవం

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ నారాయణ రెడ్డి తెలిపారు. సభకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు.ఆసరా సభ నిర్వాహణపై శుక్రవారం తన చాంబర్‌లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అందరూ సమన్వయంతో పని చేసి డ్వాక్రా మహిళలు కదిలివచ్చేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి, ఏపీఎం మధుసూదన్ గుప్తా, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీఓ తులసీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

4న గుమ్మఘట్టలో..

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 4న వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం కళానాయక్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. మండల వ్యాప్తంగా డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గడ్డి వాముల దగ్ధం

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు వరిగడ్డి వాములు, రెండు ఎరువు దిబ్బలు కాలిబూడిదయ్యాయి. గ్రామ శివారులో రైతులు చిన్నతిప్పయ్య, పెన్నోబలి, రామక్రిష్ణకు చెందిన వరిగడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలంటున్నాయి. గడ్డివాములతోపాటు గంగాధర్, రామక్రిష్ణకు చెందిన ఎరువు దిబ్బలు కూడా కాలిబూడిదయ్యాయి. వీటి విలువ రూ.లక్షకుపైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. సర్పంచు ఫణీంద్రతోపాటు స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రాయదుర్గ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులో తెచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాయదుర్గంటౌన్: అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే కౌన్సిల్ సభ్యులకు లక్ష్యం కావాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ఎజెండాలోని అంశాలను సిబ్బంది చదివి వినిపించగా పలు అంశాలపై కౌన్సిలర్లు కొన్ని సందేహాలు సమావేశం దృష్టికి తీసుకొచ్చి కమిషనర్ దివాకర్ రెడ్డి, చైర్‌పర్సన్ అడిగి నివృత్తి చేసుకున్నారు. అనంతరం అజెండాలోని అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. పలువురు కౌన్సిలర్లు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు పెట్టడం లేదన్నారు. దీంతో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపులో అధికారులు మరోసారి జాప్యం చేస్తే మరో సమావేశంలో చర్యలు తీసుకునేందుకు కౌన్సిల్ తీర్మానం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తాగునీటి పథకం మోటార్లు బిగించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. డీఈ రామ్మూర్తి, వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, హౌసింగ్ ఏఈ జయచంద్ర, మేనేజర్ కిశోర్, అకౌంటెంట్ ఈశ్వర్, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

శెట్టూరు: మహిళల సామాజిక, ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ జె. లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల మైదానంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సచివాలయ కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, మాజీ ఎంపీపీ రామభీమప్ప, ఎస్ ఎంపీపీలు వడ్డే లక్ష్మీదేవి, చెవుల కిష్టప్ప, తహసీల్దార్ ఫణికుమార్, ఏరియా కోఆర్డినేటర్ రాధరాణి, ఇంచార్జ్ ఎంపీడీఓ గంగావతి, ఏపీఎం సర్దానప్ప, మహిళ సంఘాల సభ్యులతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంరతం 3వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.4.15 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాథరెడ్డి, ముత్యాలు, పోస్ట్ రామకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, సర్పంచ్‌లు సత్యనారాయణ రెడ్డి, గొర్ల గంగాధర, విరుపాక్షి, ఈరన్న, వెంకటేశులు, నాగరాజు, చెర్లోపల్లి సర్పంచ్ విరుపాక్షి, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, వైకేపీ సిబ్బంది, వీఓ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యుల నియామకం

కంబదూరు: మండలంలోని నూతిమడుగులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు నియమకమయ్యారు. గతంలో మండలంలోని 42 గ్రామాల ప్రజలకు కంబదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే అందుబాటులో ఉండేది. దీంతో కంబదూరు పీహెచ్‌సీకి రావాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో మంత్రి ఉషశ్రీచరణ్ ప్రత్యేక చొరవ తీసుకుని నూతిమడుగులో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఆ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు గురుప్రసాద్, ప్రసన్నకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి రూ.2.22 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా నూతిమడుగులో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కావడంతో స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



వైద్యులు గురుప్రసాద్, ప్రసన్నకుమార్

తక్షణసాయం అందజేత

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని హొసగుడ్డంలో బెనెకల్లు బసప్ప అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద తక్షణసాయంగా రూ.10 వేల నగదును శుక్రవారం అతడి భార్య గురుపాదమ్మ కు సచివాలయ కార్యదర్శి రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. మిగిలిన రూ.90 వేల నగదు సకాలంలో అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఎంపీటీసీ శివలింగ, నాయకులు చంద్ర, కే హనుమంతరెడ్డి, చిక్కన్నయ్య, మంజునాథ, ఉమేష్, ఈరన్న, వాలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని కమలపాడుకు చెందిన ఉడిపి రామాంజినేయులు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్‌బీమా పథకం కింద తక్షణ సాయం కింద శుక్రవారం రూ.10 వేల నగదును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. సర్పంచు కురుబ తిరకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ అల్లెప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ తిమ్మప్ప, వలంటీర్ తులసి తదితరులు పాల్గొన్నారు.



డి హీరేహాళ్: నగదు అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వజ్రకరూరు: కమలపాడులో తక్షణసాయం అందజేస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి ధ్యేయం

రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట: అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాయదుర్గం మండలంలోని వేపరాల గ్రామం నుంచి కణేకల్లు మండలం కొత్తపల్లి వయా ఆదిగాన పల్లి మీదుగా ఏఎంసీ నిధులు రూ.74 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు ఆయన తన సతీమణి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపుభారతి , సర్పంచ్ హసీనా బేగం, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా, పంచాయతీ రాజ్ డీఈ రామ్మోహన్ రెడ్డి, కాంట్రాక్టర్లు డీఎంసీ ధరణి, కొత్తపల్లి సత్యనారాయణతో కలసి శుక్రవారం ఆయన వేపరాల గ్రామంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌పీ అధికారంలోకి వచ్చిన 46 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 98 శాతం హామీలను నెరవేర్చి మేనిఫెస్టో అంటే పవిత్రగ్రంధం లాంటిదని నిరూపించిన మహానాయకుడన్నారు. ప్రజా సమస్యల గురించి పట్టించుకోని చంద్రబాబు అతని అనుచరగణం పిచ్చిప్రేలాపనలు పేలడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ఆకాంక్షించారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని డీఎంసీ మేనేజర్ రఫీక్ కు సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ధనుంజయ, మాజీ సర్పంచ్ శంకర్, వెంకటేష్ స్వామి, ఉప్పర నాగేంద్ర, రామన్న, వెంకటస్వామి, మారెన్న, మాజీ వైస్ ఎంపీపీ బాబులు, బొజ్జప్ప, ముక్కణ్ణ, సన్నన్న , ఈఓపీఆర్డీ రఘురామారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్రపల్లి రహదారికి మోక్షం

గుమ్మఘట్ట మండలంలోని నేత్రపల్లి రహదారికి మోక్షం లభించింది. రూ.30 లక్షల ఏఎంసీ నిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయడంతో భూపసముద్రం క్రాస్ నుంచి నేత్రపల్లి గ్రామం వరకూ బీటీ రోడ్డు పనులను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పనులను గురువారం ప్రారంభించారు. నాణ్యతప్రమాణాలను పాటించి సకాలంలో రోడ్డును పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కల్వర్టు నిర్మాణానికి మరో రూ.12 లక్షలు మంజూరు చేస్తానని విప్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు సీఎస్ మహేష్, మండల కన్వీనర్ మంజునాథ, బేలోడు సర్పంచ్ ఉమేష్, కాంట్రాక్టర్లు ఆర్టీ కాంతారెడ్డి , కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, పీఆర్ డీఈ రాంమోహన్‌రెడ్డి, వైస్ సర్పంచ్ వన్నూరుస్వామి, హేమారెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట: నేత్రపల్లి సమీపంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు

కమ్యూనిస్టు నేత రంగన్న సేవలు ఎనలేనివి

ఉరవకొండ: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఛాయాపురం తమ్మినేని రంగన్న సేవలు ఎనలేనివని కమ్యూనిస్టు నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం కమ్యూనిస్టు నేత రంగన్న వర్ధంతి సభ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించారు. ఆయన కుమారుడు ప్రవాసాంధ్రుడు తమ్మినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. అనంతరం ప్రవాసాంధ్రుడు రాజశేఖర్ ప్రభుత్వాస్పత్రికి వీల్ ఛైర్స్, రోగులు సేద తీరడానికి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ రంగన్న ట్రస్టు ద్వారా ఉరవకొండలో విద్య, వైద్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. వార్డు సభ్యుడు పాటిల్ నిరంజన్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తేజోనాథ్, బసవరాజు, సీపీఐ నాయకుడు శివన్న, సీపీఎం నాయకులు జ్ఞానమూర్తి, రంగారెడ్డి, ఎంపీటీసీ వన్నూర్‌సాబ్, లెనిన్‌బాబు, హోతూరు శ్రీధర్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సెబ్ సీఐ లక్ష్మణ దాస్, రూరల్ ఎస్ఐ సుధాకర్ శుక్రవారం వేలం నిర్వహించారు. మొత్తం 11 వాహనాలకు వేలం నిర్వహించగా 10 వాహనాలను పలువురు దక్కించుకున్నారు. వీటి ద్వారా రూ.1,68,740 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

సజావుగా పాలకవర్గ సమావేశం

ఉరవకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన శుక్రవారం పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈఓ గౌస్ సాహెబ్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీ పరిధిలోని స్వచ్ఛభారత్ క్లాప్‌మిత్ర సిబ్బందికి అక్టోబర్ 2022 నుంచి మార్చి 2023 వరకూ చెల్లించాల్సిన వేతనాలను పంచాయతీ సాధారణ నిధులు మంజూరు చేయుటకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. దీంతో పాటు పంచాయతీకి ప్రతిఫలమచ్చే వ్యాపారాలపై ప్రజారోగ్య సిబ్బందికి కొబ్బరినూనె, సబ్బులు, స్టేషనరీ, పాదరక్షలు, యూనిఫాం, రక్షిత మంచినీటి సరఫరా మోటారు రివైండింగ్‌కు ఈనెల 29న నిర్వహించిన సీల్డ్ టెండర్ల రిజిస్ట్రార్ మేరకు ఖాయం చేస్తున్నామన్నారు. ఈనెల 29న నిర్వహించిన ఫ్లాష్‌అవుట్ పాయిఖానా టెండరును తిరిగి రీటెండరు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నప్ప, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓ గౌస్‌సాహెబ్

సూర్యప్రభ వాహనంపై జంబుకేశ్వరుడు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి స్వామి సూర్యప్రభ వాహనం కోట వీధుల మీదుగా వినాయక సర్కిల్, లక్ష్మీబజార్ వరకు ఊరేగించారు. అక్కడి నుంచి తిరిగి స్వామి వాహనం ఆలయానికి చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి సింహ వాహనోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు.

గిరిజనుడు చైర్మన్‌గా ఉండడం ఇష్టం లేదా..?

రాయదుర్గం: గిరిజన వ్యక్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా ఉండడటం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు ఇష్టమున్నట్టు లేదని, దీంతో పనిగట్టుకుని నిత్యం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని చైర్మన్ వడిత్య భోజరాజ్‌నాయక్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు తో కలసి ఆయన మాట్లాడారు.. ఇసుక దోపిడీ దారులెవరో ప్రజలకు తెలియంది కాదన్నారు. నీవు మంత్రిగా ఉండే సమయాన ఈ వ్యాపారం ఏ స్థాయిలో జరిగిందనే విషయం నీ మానస పుత్రికగా చెప్పుకునే ఈనాడులో అచ్చేసిన రాతలే నిదర్శనమన్నారు. తనతోపాటు విప్ కాపు రామచంద్రారెడ్డిపై ఇసుక విషయంలో నీవు చేసిన ఆరోపణలు నిలుపుకోగలవా అంటు సవాల్ విసిరారు. ఈ నెల 13న కర్ణాటక రాష్ట్రం బళ్లారి సరిహద్దులో పట్టుబడ్డ టిప్పర్‌ను తనకు అంటగట్టేలా చేసిన కుట్రలపై సమాధానం చెప్పాలన్నారు. పట్టుబడ్డ టిప్పర్ ఓబుళాపురానికి చెందిన టీడీపీ నాయకుడి బంధువుదని మండిపడ్డారు. బలహీన వర్గానికి చెందిన తన పై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తే ఇకపై ఊరుకునేది లేదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న చైర్మన్ భోజరాజ్‌నాయక్